సాక్షి మహబూబ్‌నగర్

ఆదివారం । 18 । మే । 2025



రహదారులు రక్తసిక్తం

ఉమ్మడి జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మృతిచెందారు.

వివరాలు 8లో ▸



ఇంట్రా డిస్ట్రిక్ట్ టూడే లీగ్

ఉమ్మడి జిల్లాలో మొదటిసారిగా ఇంట్రా డిస్ట్రిక్ట్ లీగ్‌లకు శ్రీకారం చుట్టారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.0 /23.1

ఉదయం నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.



పాలమూరు అందాలు చూసొద్దాం

మయూరి అర్బన్ ఎకో పార్క్

మహబూబ్‌నగర్ సమీపంలో అప్పన్నపల్లి శివారులో మయూరి అర్బన్ ఎకో పార్క్ వన విహారకేంద్రంగా రూపుదిద్దుకుంది. 2,087 ఎకరాల్లో విస్తరించిన ఈపార్క్‌లో అడ్వెంచర్ గేమ్స్ ఆకట్టుకుంటున్నాయి. ఇక్కడ చిల్డ్రన్స్ పార్క్, బటర్‌ఫ్లై గార్డెన్, కరెన్సీ పార్క్, రోజ్ గార్డెన్, రాశీవనం, నక్షత్ర వనం, హెర్బల్‌గార్డెన్, హిల్‌వ్యూ పాయింట్, జంగిల్ సఫారీలు అమితంగా ఆకర్షిస్తున్నాయి.

ఏడు తరాలకు సజీవ సాక్ష్యంగా నిలిచిన పిల్లలమర్రి, చారిత్రక కట్టడాలు, పురాతన దేవాలయాలు, ఆకట్టుకునే ప్రాజెక్టులు, ప్రకృతి అందాల నడుమ అలల సవ్వడిలో కృష్ణమ్మ ఒడిలో సాగే బోటు ప్రయాణాలు, జలపాతాలు, జంగిల్ సఫారీ.. ఇలాంటి ఎన్నో విశేషాలతో పాలమూరు పర్యాటకం సందర్శకులను కనువిందు చేస్తోంది. రోజురోజుకు సరికొత్త హంగులతో రూపుదిద్దుకుంటున్న పర్యాటక ప్రాంతాలు ఎప్పటికప్పుడు కొత్తదనం సంతరించుకుంటున్నాయి. పిల్లలు, పెద్దలకు ఆహ్లాదాన్ని పంచుతూ హాలీడేస్‌ను జాలీడేస్‌గా మార్చేస్తోంది.

– నాగర్‌కర్నూల్/ కొత్తకోట

సమ్మర్ స్పెషల్

పిల్లలమర్రి

మహబూబ్‌నగర్‌కు 5 కిలోమీటర్ల దూరంలో పిల్లలమర్రి ఉంది. అతిపెద్ద ఆకుపచ్చ గొడుగులాగా నాలుగు ఎకరాల్లో విస్తరించిన ఈ భారీ వృక్షానికి 750 ఏళ్లు ఉంటాయని అంచనా. ఇది రాష్ట్రంలోనే అతిపెద్ద మర్రి వృక్షం. పిల్లలమర్రి పురావస్తు మ్యూజియంలో క్రీ.శ.7వ శతాబ్దం నుంచి 15వ శతాబ్ది శిల్ప పరిణతిని చాటే అపురూప శిల్పాలున్నాయి. మహబూబ్‌నగర్‌లోని మెట్టుగడ్డ నుంచి వెళ్లాల్సి ఉంటుంది.



చంద్రగఢ్ కోట


వనపర్తి జిల్లా అమరచింత మండలం చంద్రగఢ్ కోట విశేషంగా ఆకట్టుకుంటుంది. చంద్రగుప్త మౌర్యుల సంస్థానాలను పరిపాలించే కాలంలో పాలన సౌలభ్యం కోసం చంద్రగఢ్ గ్రామంలో గుట్టపై విశాలమైన మైదానంలో ఈ కోటను నిర్మించారు. ఎండకాలం వచ్చినా కోట కొలనులో నీరు ఎండిపోవడం లేదు. మహబూబ్‌నగర్ నుంచి 65 కి.మీ. దూరంలో ఉంటుంది.



ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు

రాష్ట్రంలో ఎక్కువ క్రస్టుగేట్లతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టును నిర్మించారు. 67 గేట్లతో కిలోమీటర్ పొడవున ప్రధాన నిర్మాణం ఉంటుంది. 44వ నంబర్ జాతీయ రహదారి ఎర్రవల్లి చౌరస్తా నుంచి గద్వాల మీదుగా జూరాల ప్రాజెక్టుకు చేరుకోవచ్చు. హైవే నుంచి గద్వాలకు 17కి.మీ... అక్కడి నుంచి జూరాల ప్రాజెక్టుకు 18 కిలోమీటర్ల దూరంలో ఉంది.

అలంపూర్



దేశంలోని అష్టాదశ శక్తిపీఠాల్లో ఐదో శక్తిపీఠం జోగుళాంబ ఆలయం. బాలబ్రహ్మేశ్వరస్వామి, నవబ్రహ్మ ఆలయాల సముదాయాలతో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోంది. బాదమీ చాళుక్యులు 6, 7 శతాబ్దంలో నిర్మించిన బహు పురాతన ఆలయాలు అలంపూర్‌లో ఉన్నాయి. తుంగభద్ర నదికి ఉత్తరాన ఉండడంతో ఉత్తర వాహిని క్షేత్రంగా పిలుస్తారు. ఎన్‌హెచ్ 44పై అలంపూర్ చౌరస్తాలో దిగి.. 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ క్షేత్రానికి వెళ్లొచ్చు.

మన్యంకొండ

మన్యంకొండ పేదల తిరుపతిగా ప్రసిద్ధి చెందింది. ఉలి ముట్టని స్వామి, చెక్కని పాదాలు, తవ్వని కోనేరు స్వామివారి దేవస్థానం ప్రత్యేకత. కొండ దిగువన అలివేలు మంగతయారు ఆలయం ఉంటుంది. రాయచూర్‌కు వెళ్లే మార్గంలో మహబూబ్‌నగర్ నుంచి 19 కిలోమీటర్ల దూరంలో మన్యంకొండ ఉంది.



కురుమూర్తి స్వామి ఆలయం

తిరుపతి వెంకన్నస్వామి కుబేరుడి అప్పు తీర్చడంలో కలత చెంది కురుమూర్తి గిరులకు వలస వచ్చి తలదాచుకున్నాడట. శిలారూపంగా ప్రత్యక్షరూపంలో కురుమూర్తి రాయుడిగా భక్తులతో విశేష పూజలు అందుకుంటున్నారు. అమ్మాపురం సంస్థానాధీశులు ఈ ఆలయాన్ని నిర్మించారు. మహబూబ్‌నగర్ నుంచి 60 కి.మీ.దూరంలో ఈ క్షేత్రం ఉంది.



కనువిందు చేస్తున్న నల్లమల

నాగర్‌కర్నూల్ జిల్లాలో విస్తరించి ఉన్న నల్లమల అభయారణ్యంలో ఎన్నో పర్యాటక ప్రాంతాలున్నాయి. ఎత్తైన కొండల నుంచి జాలువారే నీటి దృశ్యాలు మళ్లీమళ్లీ చూడాలనిపించేలా మల్లెలతీర్థం జలపాతం కనువిందు చేస్తోంది. 500 అడుగుల ఎత్తు నుంచి నిరంతరం దూకే జలధర మూడు సరస్సులను నింపుతూ కృష్ణానదిలో కలుస్తుంది. మహబూబ్‌నగర్ నుంచి శ్రీశైలం వెళ్లే ప్రధాన రహదరిలో వటువర్లపల్లి నుంచి ఎడమవైపునకు వెళ్తే 8కి.మీ. దూరంలో మల్లెలతీర్థం ఉంటుంది. మహబూబ్‌నగర్ నుంచి 135 కి.మీ. దూరంలో ఉంది. అలాగే మన్ననూరులోని చెంచుల మ్యూజియం, వ్యూపాయింట్‌ను తిలకించడంతో పాటు సఫారీ ప్రయాణం కూడా చేయవచ్చు.








ఉమామహేశ్వర క్షేత్రం: క్రీ.శ. 1232లో కాకతీయులు ఈ దేవాలయాన్ని నిర్మించారు. అచ్చంపేటకు 12 కి.మీ. మహబూబ్‌నగర్‌కు 105కి.మీ.దూరంలో ఉంటుంది. శ్రీశైలం ఉత్తరద్వారంగా ప్రసిద్ధి చెందిన ఈ క్షేత్రం కొండబాణం ఆకారంలో వంపు తిరిగి ఉండడంతో ఎంతో ఆకట్టుకుంటుంది.


సోమశిల: నల్లమల అందాలు తిలకిస్తూ జలజలపారుతున్న కృష్ణానదిలో బోటు ప్రయాణం చేయాలంటే కొల్లాపూర్ మండలం సోమశిలకు వెళ్లాల్సిందే. సోమేశ్వరాలయంతో పాటు 11 పవిత్ర ఈశ్వరాలయాల విగ్రహరూపాలు ఇక్కడ కొలువు దీరాయి. సప్తనదుల సంగమం, పురావస్తు మ్యూజియం ఉన్నాయి. నది మధ్యలో సంగమేశ్వరాలయం ఇక్కడే ఉంది. సోమశిల నుంచి ప్రత్యేక బోటులో అక్కడికి చేరుకోవచ్చు. కొల్లాపూర్ నుంచి సోమశిల 9కి.మీ. మహబూబ్‌నగర్ నుంచి 100 కి.మీ. దూరంలో ఉంది.



రంగనాథస్వామి ఆలయం



350 ఏళ్ల క్రితం సూగూరు రాజ వంశీయులు వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్‌లో ఈ ఆలయాన్ని నిర్మించారు. ఆలయం పక్కనే ఉండే శ్రీరంగసముద్రం విశేషంగా ఆకట్టుకుంటుంది. ఆలయంలోని నేలమాలిగలో ఆలనాటి చిత్రకళను నిదర్శనంగా బంగారు పూతతో పూసిన అపురూప దేవతామూర్తుల చిత్రపటాలు దర్శనమిస్తాయి. మహబూబ్‌నగర్ నుంచి పెబ్బేరుకు చేరుకుని.. అక్కడి నుంచి 12కి.మీ.దూరంలో ఉన్న శ్రీరంగాపూర్ గ్రామానికి వెళ్లవచ్చు.



కోయిల్‌సాగర్

జిల్లాలో ప్రధాన నీటి పారుదల ప్రాజెక్టుల్లో కోయిల్‌సాగర్ ఒకటి. కేవలం రూ.80 లక్షలతో ఈ ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయి. చుట్టూ కొండ మధ్య.. రెండు గుట్టలను అనుసంధానం చేస్తూ ఈ ప్రాజెక్టును నిర్మించారు. మహబూబ్‌నగర్ నుంచి రాయచూర్‌కు వెళ్లే మార్గంలో 36 కి.మీ. దూరంలో, దేవరకద్రకు 12 కి.మీ.దూరంలో ఈ ప్రాజెక్టు ఉంది.

పకడ్బందీగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ విజయేందిర

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లాలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి 29 వరకు నిర్వహించనున్న పరీక్షల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు మొదటి సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు రెండో సంవత్సరం పరీక్షలు కొనసాగుతాయన్నారు. మొత్తం 9,069 మంది రాయనున్న ఆయా పరీక్షలకు గాను జిల్లావ్యాప్తంగా 19 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అలాగే జూన్ 3 నుంచి 6 వరకు ప్రాక్టికల్స్ జరుగుతాయన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు మొదటి సంవత్సరం, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు ఉంటాయన్నారు. ఆయా పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డీఐఈఓ కౌసర్ జహాన్, నగర పాలక సంస్థ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వృత్తి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

వృత్తి నైపుణ్యం పెంపు కోసం ఇస్తున్న శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. ఈ నెల 13 నుంచి జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆమె జిల్లాకేంద్రంలోని జేపీఎన్‌ఈఎస్ భవనంలో ఇస్తున్న శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని స్థాయిలలో ఇచ్చే శిక్షణ కార్యక్రమాలను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకొని ఇంకా మెరుగైన పద్ధతిలో విద్యార్థులకు బోధించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలలు తెరిచిన తర్వాత రెండు వారాల పాటు 1 నుంచి 10వ తరగతి వరకు వర్ణమాల, ఇంగ్లిష్ అక్షరాలు, పదాలు, గణిత భావనలపై పునశ్చరణ తరగతులు నిర్వహించి విద్యార్థులను సంసిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష జాయింట్ డైరెక్టర్ వెంకటనర్సమ్మ, డీఈఓ ప్రవీణ్ కుమార్, ఏఎంఓ శ్రీనివాస్, సీఎంఓ బాలుయాదవ్ పాల్గొన్నారు.

నిర్దేశిత గడువులోగా అనుమతులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లాలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ టీజీ ఐపాస్ ద్వారా పరిశ్రమల స్థాపనకు వివిధ శాఖల నుంచి అనుమతులను నిబంధనల మేరకు నిర్దేశిత గడువులోగా మంజూరు చేయాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. టీ ప్రైడ్ ద్వారా షెడ్యూల్డ్ తెగలకు సంబంధించి నలుగురికి ట్రాన్స్‌పోర్ట్ సెక్టార్ కింద వాహనాలు, పెట్టుబడి సబ్సిడీ మంజూరుకు కమిటీలో ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ ప్రతాప్, టీజీఐఐసీ డీడీ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న క్వింటాల్ రూ.2,221

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌కు శనివారం వ్యవసాయ పంట దిగుబడులు పోటెత్తాయి. యార్డుకు 6,299 క్వింటాళ్ల పంట ఉత్పత్తులు విక్రయానికి వచ్చాయి. కాగా.. మొక్కజొన్న క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,221, కనిష్టంగా రూ.1,301 ధరలు లభించాయి. అలాగే ఆముదాలు క్వింటాల్ సరాసరిగా రూ.5,965 పలికింది.

30, 31 తేదీల్లో శిక్షణ తరగతులు

మహబూబ్‌నగర్ రూరల్: కేవీపీఎస్ జిల్లా సామాజిక శిక్షణ తరగతులు ఈ నెల 30, 31 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుర్మయ్య తెలిపారు. శనివారం స్థానిక సీఐటీ యూ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ యన మాట్లాడారు. రెండు రోజుల శిక్షణ తరగతులలో కుల వి వక్షత, అంటరానితనం, కుల సమస్యలు– పరిష్కార మార్గాలు, దోపిడీ మూలాలు, మతోన్మాదం ప్రతిఘటన పద్ధతులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం అంశాలపై కా ర్యకర్తలకు అవగాహన కల్పిస్తామన్నారు. వాస్తవానికి చట్టాలు, ఎస్సీ కార్పొరేషన్ రుణాలు, అంటరానితనంపై ప్రభుత్వమే దళిత యువతీ, యువకులకు అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. కేవీపీఎస్ పరంగా అవగాహన తరగతులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. శిక్షణకు జిల్లాలోని 17 మండలాల నుంచి కేవీపీఎస్ కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. సమావేశంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మాణిక్యంరాజు, రాష్ట్ర కమిటీ సభ్యురాలు లక్ష్మీదేవి, జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్రాములు ఉన్నారు.

క్లుప్తంగా

ఆర్టీసి బస్టాండ్‌లో వృద్ధుడి హఠాన్మరణం

వనపర్తి రూరల్: వనపర్తి జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ వృద్ధుడు మృతిచెందాడు. ఎస్‌ఐ హరిప్రసాద్ వివరాల మేరకు.. పాన్‌గల్ మండలం గోప్లాపూర్‌కు చెందిన కోటయ్య (60)కు ఆరోగ్యం బాగో లేకపోవడంతో మహబూబ్‌నగర్‌లోని ఆస్పత్రికి వెళ్లేందుకు శనివారం గ్రామం నుంచి వనపర్తికి చేరుకున్నాడు. అయితే బస్టాండ్ ప్రాంగణంలోని చలివేంద్రం వద్ద సిమెంట్ బెంచీ పక్కన కూర్చున్న అతడు.. అకస్మాత్తుగా కుప్పకూలిపోయాడు. గమనించిన ఆర్టీసీ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకొని అతడిని 108 అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు.. అప్పటికే కోటయ్య మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై మృతుడి కుటుంబ సభ్యుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు.

గోడ కూలి వ్యక్తి మృతి

ఊట్కూరు: మండలంలోని కొల్లూరులో ప్రమాదవశాత్తు గోడ కూలి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. కొల్లూరుకు చెందిన మాల చంద్రప్ప (55) శనివారం అదే గ్రామానికి మంగళి లక్ష్మమ్మ మట్టి ఇల్లు కూల్చివేత పనులకు వెళ్లాడు. ఇంటి గోడను కూలగొడుతున్న క్రమంలో ఒక్కసారిగా అతడిపై కూలి పడింది. గమనించిన స్థానికులు వెంటనే అతడిని శిథిలాల నుంచి బయటికి తీయగా.. అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ కృష్ణంరాజు తెలిపారు.

తండ్రితో డబ్బుల వ్యవహారంలో గొడవ..

- కుమారుడి ఆత్మహత్య

మహబూబ్‌నగర్ క్రైం: డబ్బుల వ్యవహారంలో తండ్రితో గొడవ పెడిన యువకుడు మనస్తాపంతో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్‌ఐ కె.రాజు కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని ఏనుగొండకు చెందిన బాలకృష్ణ(21) ప్రైవేట్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. డబ్బుల విషయంలో శుక్రవారం రాత్రి తండ్రితో గొడవ జరగడంతో ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయాడు. మనస్తాపానికి గురైన బాలకృష్ణ ఏనుగొండ సమీపంలో రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. తండ్రి బుచ్చయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

అయిజ: మండలంలోని బింగుదొడ్డి గ్రామానికి చెందిన హనుమన్న (62) చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. ఎస్‌ఐ శ్రీనివాసరావు వివరాల మేరకు.. బింగుదొడ్డికి చెందిన హనుమన్న కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి రోడ్డుపక్కన అపస్మారక స్థితితో అతడు పడి ఉండటాన్ని బాటసారులు గుర్తించి 108 అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతడు మృతిచెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు.

బావిలో పడి యువకుడి మృతి


ఆనంద్‌కుమార్ (ఫైల్)

దేవరకద్ర: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ యువకుడు మృతిచెందాడు. స్థానికుల వివరాల మేరకు.. కౌకుంట్లకు చెందిన ఆనంద్ కుమార్ (27) గ్రామ సమీపంలో చేపట్టిన ఉపాధి హామీ పనులకు వెళ్లాడు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో బహిర్భూమికి వెళ్లిన అతడు.. ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి మృతిచెందాడు. అతడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

తాళం వేసిన ఇళ్లకు కన్నం

దేవరకద్ర/మన్ననూర్: దేవరకద్రకు చెందిన శివ అనే వ్యక్తి తన భార్యను అత్తగారింట్లో వదిలిపెట్టడానికి శుక్రవారం వెళ్లాడు. తిరిగి రాత్రి ఆలస్యంగా ఇంటికి చేరుకోగా.. అప్పటికే ఇంటికి వేసిన తాళం పగులగొట్టి కనిపించింది. ఇంట్లోని వస్తువలన్నీ చిందరవందరగా పడ్డాయి. ఇంట్లో దాచిన రూ. 2లక్షలు కనిపించకపోవడంతో దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించిన బాధితుడు.. శనివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ నాగన్న ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లో తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిలో ఉన్న దాబా కాటేజీ నిర్వాహకుడు నరేశ్ బంధువుల వివాహం ఉండటంతో ఇటీవల కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన గుర్తుతెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉంచిన 8 తులాల బంగారం, 10 తులాల వెండి, రూ. 30వేల నగదు చోరీ చేశారు. కాగా, బుధవారం రాత్రి ఓ వ్యక్తి ఆ ప్రాంతంలో తచ్చాడినట్లు సీసీ పుటేజీల్లో నిక్షిప్తమైందని.. ఈ ఘటనపై అమ్రాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

రేపటి నుంచి ఇంట్రా డిస్ట్రిక్ట్ టూడే లీగ్

- వచ్చేనెల 1వ తేదీ వరకు కొనసాగనున్న అండర్–23 క్రికెట్ మ్యాచ్‌లు
- ఉమ్మడి జిల్లాలోని ఆరు వేదికల్లో నిర్వహణ


ఎండీసీఏ మైదానంలో ఇంట్రా డిస్ట్రిక్ట్ లీగ్‌లకు క్రీడాకారుల ఎంపికలు (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రీడలు: ఎండీసీఏ ఆధ్వర్యంలో వేసవిలో నిర్వహిస్తున్న క్రీడా శిక్షణ శిబిరాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. అయితే ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఉమ్మడి జిల్లాలో మొదటిసారిగా ఇంట్రా డిస్ట్రిక్ట్ లీగ్‌లకు శ్రీకారం చుట్టారు. ఈ లీగ్‌లకు సంబంధించి ఇటీవల ఉమ్మడి జిల్లాలోని ఆరు ప్రాంతాల్లో అండర్–19, 23 విభాగాల జిల్లాల జట్ల ఎంపికలు నిర్వహించగా.. వందలాది విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

పాల్గొననున్న ఆరు జట్లు..

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం ఈ నెల 19 నుంచి వచ్చేనెల 1వ తేదీ వరకు ఇంట్రా డిస్ట్రిక్ట్ పురుషుల అండర్–23 క్రికెట్ టూడే లీగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎండీసీఏ ఆధ్వర్యంలో లీగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ లీగ్‌లో పాల్గొనే ఆరు జట్లను రెండు పూల్‌లుగా విభజించారు. పూల్–ఏలో మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, పూల్–బీలో జడ్చర్ల, గద్వాల, నాగర్‌కర్నూల్ జట్లు ఉన్నాయి. ఐదు రౌండ్లలో టూడే లీగ్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు.

క్రీడాకారులు ప్రతిభ చాటాలి..

ఇంట్రా డిస్ట్రిక్ట్ అండర్–23 లీగ్‌లో క్రీడాకారులు ప్రతిభచాటాలని ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ అన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ ఇంట్రా డిస్ట్రిక్ట్ లీగ్‌లు పెట్టడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యంగా గ్రామీణ క్రీడాకారులకు ఈ లీగ్ ఒక వరంలా మారనుంది. ఈ లీగ్‌లో రాణించే క్రీడాకారులను రానున్న హెచ్‌సీఏ లీగ్‌ల్లో పాల్గొనే ఎండీసీఏ జట్లకు ఎంపిక చేస్తాం.

మ్యాచ్‌ల వివరాలు..

ఉమ్మడి జిల్లాలోని ఆరు వేదికల్లో మ్యాచ్‌లు కొనసాగనున్నాయి. మొదటి రౌండ్ ఈ నెల 19, 20 తేదీల్లో నాగర్‌కర్నూల్–వనపర్తి (వేదిక–నాగర్‌కర్నూల్), జడ్చర్ల–మహబూబ్‌నగర్ (జడ్చర్ల), గద్వాల–నారాయణపేట (నారాయణపేట), రెండో రౌండ్ 22, 23 తేదీల్లో మహబూబ్‌నగర్–గద్వాల (మహబూబ్‌నగర్), వనపర్తి–నారాయణపేట (వనపర్తి), జడ్చర్ల–నాగర్‌కర్నూల్ (జడ్చర్ల), మూడో రౌండ్ 25, 26 తేదీల్లో నారాయణపేట–జడ్చర్ల (నారాయణపేట), మహబూబ్‌నగర్–నాగర్‌కర్నూల్ (మహబూబ్‌నగర్), వనపర్తి–గద్వాల (గద్వాల), నాలుగో రౌండ్ 28, 29 తేదీల్లో మహబూబ్‌నగర్–వనపర్తి (మహబూబ్‌నగర్), జడ్చర్ల–గద్వాల (జడ్చర్ల), నారాయణపేట–నాగర్‌కర్నూల్ (నాగర్‌కర్నూల్), ఐదో రౌడ్ 31, జూన్ 1 తేదీల్లో మహబూబ్‌నగర్–నారాయణపేట (నాగర్‌కర్నూల్), గద్వాల–నాగర్‌కర్నూల్ (మహబూబ్‌నగర్), జడ్చర్ల–వనపర్తి (గద్వాల).

రహదారులు రక్తసిక్తం

- వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురి దుర్మరణం
- అతివేగం, అజాగ్రత్త డ్రైవింగ్‌తో నిండు ప్రాణాలు బలి



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో శనివారం వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు దుర్మరణం చెందారు. అతివేగం, అజాగ్రత్తతో కూడిన డ్రైవింగ్‌తో రహదారులు రక్తసిక్తమయ్యాయి. నారాయణపేట జిల్లాలో కర్ణాటక ఆర్టీసీ బస్సు, జీపు అతివేగంగా ఢీకొన్న ప్రమాదంలో పదేళ్ల చిన్నారితో సహా ఓ మహిళ దుర్మరణం చెందగా.. మరో నలుగురు గాయపడ్డారు. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండలో ట్రాక్టర్‌ను పాల ట్యాంకర్ ఢీకొట్టిన ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందాడు. మక్తల్‌లో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ మహిళను లారీ ఢీకొట్టడంతో దుర్మరణం చెందింది. జడ్చర్ల మండలంలో ట్రాక్టర్‌ను కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు, బైక్‌పై నుంచి పడి మరొకరు మృతి చెందారు.

– నారాయణపేట రూరల్/వెల్దండ/జడ్చర్ల/మాగనూర్(మక్తల్)


శిరీష (ఫైల్)


ప్రమాదానికి గురైన బస్సు, జీపు

నారాయణపేట జిల్లాలో అతివేగం, నిర్లక్ష్యంతో కూడిన డ్రైవింగ్ రెండు ప్రాణాలను బలి తీసుకుంది. వివాహ వేడుకకు బంగారం ఆభరణాలు కొనేందుకు ఓ కుటుంబంతో పాటు బంధువుల ఇంట్లో విందుకు హాజరై జీపులో వస్తున్న మరో కుటుంబాన్ని ఆర్టీసీ బస్సు రూపంలో మృత్యువు వెంటాడింది. ఈ ఘటనలో చిన్నారితో సహా ఓ మహిళ దుర్మరణం చెందారు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం గుర్మిట్కల్ తాలూకా సీపురం గ్రామానికి చెందిన బీమరాయ అనంతమ్మ (55) కుటుంబంలో ఈ నెలాఖరులో వివాహం జరగనుంది. అయితే నారాయణపేటలో బంగారం ఆభరణాలు కొనుగోలు చేసేందుకు కుటుంబ సభ్యులతో కలిసి శనివారం మధ్యాహ్నం జీపులో స్వగ్రామం నుంచి బయలుదేరారు. ఈ క్రమంలోనే నారాయణపేట కుమ్మరివాడకు చెందిన కుమ్మరి ఊశన్న తన కూతురు శిరీష (10), ఇతర కుటుంబ సభ్యులతో కలిసి కర్ణాటక రాష్ట్రం క్యాసారంలో బంధువుల విందును ముగించుకొని తిరుగు ప్రయాణమయ్యారు. అదే సమయంలో సీపురంలో బీమరాయ అనంతమ్మ కుటుంబ సభ్యులు వస్తున్న జీపు రావడంతో రిక్వెస్ట్ చేసి అందులో స్వగ్రామానికి బయలుదేరారు. తెలంగాణ సరిహద్దులోని ఎక్లాస్‌పూర్ సమీపంలో జీపు వేగంగా వస్తుండగా.. నారాయణపేట నుంచి గుర్మిటకల్ వేగంగా వెళ్తున్న ఆర్టీసీ బస్సు మూలమలుపు వద్ద వేగ నియంత్రణ కోల్పోయి ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో బీమరాయ అనంతమ్మ, శిరీషకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవర్ చిన్న మల్లికార్జున్, కోటగిరి నర్సింహ, కోటగిరి శరణమ్మ, కుమ్మరి బాలకృష్ణలకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, రేవతి పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.


పరశురాములు (ఫైల్)

నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ సమీపంలో హైదరాబాద్–శ్రీశైలం రహదారిపై జరిగిన ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మృతిచెందాడు. ఎస్‌ఐ కురుమూర్తి వివరాల మేరకు.. పెద్దకొత్తపల్లి మండలం తీర్నాంపల్లికి చెందిన ముష్టిపల్లి పరశురాములు (23) ఆమనగల్లు సమీపంలో కేఎల్‌ఐ కాల్వ పనుల వద్ద ట్రాక్టర్ నడుపుతుండే వాడు. పనిలో భాగంగా కల్వకుర్తి నుంచి ట్రాక్టర్‌లో డీజిల్ తీసుకుని ఆమనగల్లు వైపు వెళ్తుండగా.. మండల కేంద్రం సమీపంలో వెనక నుంచి వేగంగా వచ్చిన పాల ట్యాంకర్ ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పరశురాములును చికిత్స నిమిత్తం స్థానిక యెన్నమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ యశోద ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి ముష్టిపల్లి వెంకటయ్య ఫిర్యాదు మేరకు పాల ట్యాంకర్ డ్రైవర్ షరీఫ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జడ్చర్ల మండలం బండమీదిపల్లికి చెందిన సి.గోపాల్ (30) స్థానిక శివగిరిక్షేత్రం సమీపంలోని తన ఇంటికి బైక్‌పై వెళ్తుండగా.. పంది అడ్డు రావడంతో అదుపుతప్పి పక్కనున్న చెట్టును ఢీకొట్టాడు. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న అతడి తల్లి బాలమ్మ, భార్య పద్మ ఘటనా స్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తల్లి బాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు.

జడ్చర్ల మండలం గొల్లపల్లి లలితాంబిక తపోవనం సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై వెళ్తున్న ట్రాక్టర్‌ను కర్నూలువైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో ట్రాక్టర్‌పై ఉన్న చెన్నయ్య (38)కు తీవ్రగాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందినట్లు సీఐ కమలాకర్ తెలిపారు. చెన్నయ్యను రాజాపూర్ మండలం కుచ్చరకల్ గ్రామవాసిగా గుర్తించామన్నారు. ఈ ఘటనపై చెన్నయ్య భార్య అలివేలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మక్తల్ మండలం గోప్లాపూర్‌కు చెందిన పద్మమ్మ (35) బైక్‌పై చందాపూర్‌కు వెళ్తుండగా.. మక్తల్ పట్టణంలోని రాయచూర్ రోడ్డులో వెనక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో ఆమెకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

అశ్లీల ఘటనలో కేసు తిరస్కరించిన కోర్టు

- బాధితులు ఫిర్యాదు చేస్తే అత్యాచారం కేసు నమోదు చేస్తాం
- డీఎస్పీ వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలోని హన్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో అశ్లీల ఘటనకు సంబంధించి యువకుడి రిమాండ్‌లో భాగంగా కోర్టులో హాజరుపరచగా ఏడేళ్ల కంటే తక్కువ శిక్ష పడే కేసు కావడంతో కోర్టు తిరస్కరించింది. మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు వెల్లడించిన వివరాల ప్రకారం.. హన్వాడ స్టేషన్ పరిధిలో అశ్లీల కేసులో సదరు యువకుడిపై 294బీఎన్ఎస్, ఐటీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో పెట్టిన సెక్షన్స్ ఏడేళ్లలోపు శిక్ష కంటే తక్కువగా ఉండటం వల్ల కోర్టు తిరస్కరించిందని చెప్పారు. కొన్ని రోజుల కిందట ఓ యువతి ఫొటోలు తీసుకోవడానికి స్టూడియో దగ్గరకు వచ్చిన క్రమంలో ఆమెకు సంబంధించిన వీడియోలను స్నాప్‌చాట్‌లో పెట్టినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు. ఆ వెంటనే మళ్లీ డిలీట్ చేశారని, ఇప్పటి వరకు ఒకే అమ్మాయికి సంబంధించిన వీడియోలు చేసినట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. ఈ కేసు దర్యాప్తు చేయడంతోపాటు చార్జిషీట్ సైతం దాఖలు చేస్తామని, ఎవరైనా బాధితులు నేరుగా ఫిర్యాదు చేస్తే కొత్తగా 376 కింద కేసులు నమోదు చేస్తామన్నారు. ఇప్పటి వరకు బాధితులు ఎవరూ కూడా స్టేషన్‌కు రాలేదని డీఎస్పీ వెల్లడించారు. అశ్లీల కేసు నమోదైన యువకుడికి బెయిల్ మంజూరు అయ్యిందని చెప్పారు.

కార్యకర్తల కృషితోనే అధికారంలోకి వచ్చాం..


మాట్లాడుతున్న పీసీసీ ఉపాధ్యక్షుడు సాంబయ్య, పక్కన ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి

జడ్చర్ల: కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే పట్టుగొమ్మలని పీసీసీ ఉపాధ్యక్షుడు, డీసీసీ ఇన్‌చార్జ్ సాంబయ్య అన్నారు. శనివారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ నియోజకవర్గ స్థాయి సమావేశానికి డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కృషితోనే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చామన్నారు. కార్యకర్తల కృషిని పార్టీ అధిష్ఠానం ఎప్పుడూ గుర్తుంచుకుంటుందని, పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాబోయే స్థానిక ఎన్నికల నేపథ్యంలో గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ సేవలందించే వారికి పదవుల ఎంపికలో ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష, ఇతర పదవులకు సంబంధించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అందరి సమష్టి నిర్ణయంతో పదవులను ప్రకటిస్తామన్నారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు ఐక్యంగా ఉండి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో విజయం సాధించే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి ఎక్కడో ఒక దగ్గర సముచిత స్థానం కల్పిస్తామన్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ నామినేటెడ్ పదవుల ఎంపికలో పార్టీ అభివృద్ధికి పనిచేసిన వారికి న్యాయం చేస్తామన్నారు.

డీసీసీబీకి ఐఎస్‌ఓ సర్టిఫికెట్


సీఎం రేవంత్‌రెడ్డిచే ఐఎస్‌ఓ పురస్కారం అందుకుంటున్న డీసీసీబీ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, సీఈఓ పురుషోత్తం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పాలమూరు డీసీసీబీ కేటగిరి–సీ నుంచి బీకి అప్‌గ్రేడ్ కావడంతోపాటు ఐఎస్ఓ సర్టిఫికెట్ దక్కింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి సమక్షంలో డీసీసీబీ అధ్యక్షుడు మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి ఈ పురస్కారం అందుకున్నారు. కాగా, దీనికి కృషి చేసిన సీఈఓ పురుషోత్తంతోపాటు పాలకమండలి, పీఏసీఎస్ అధ్యక్షులు, బ్యాంకు అధికారులు, సిబ్బందికి విష్ణువర్ధన్‌రెడ్డి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

ఎంవీఎస్‌లో ఉపాధి ఆధారిత కోర్సులు


కోర్సుల వివరాలు వెల్లడిస్తున్న ప్రిన్సిపాల్ పద్మావతి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఉపాధి ఆధారిత కోర్సులు అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. శనివారం ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నూతన విద్యావిధానంలో భాగంగా విద్యార్థులకు మూడేళ్ల డిగ్రీలో రెండేళ్ల పాటు కళాశాలలో తరగతులు వినడం, తర్వాత మరో ఏడాది అప్రెంటిషిప్ ఉంటుందన్నారు. ఈ క్రమంలో విద్యార్థికి వేతనం సైతం లభిస్తుందన్నారు. ఇలాంటి కోర్సులు ఎంవీఎస్‌లో 5 ప్రారంభించామని, అందులో బీఎస్సీ డిజిటల్ మార్కెటింగ్‌కు ఎంపీసీ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని, బీఎస్సీ మార్కెటింగ్, ఫార్మా సేల్స్‌కు బైపీసీ, బీఎస్సీ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్‌కు బైపీసీ, బీకాం బీఎఫ్ఎస్ఐకి ఎంపీసీ, బైపీసీ, సీఈసీ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులన్నారు. వీటి ద్వారా డిగ్రీ పూర్తి అయిన వెంటనే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ప్రస్తుతం డిగ్రీలో చేరికకు దోస్త్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, ఈ నెల 21 వరకు అవకాశం ఉందన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఎంవీఎస్ కళాశాలను ఆప్షన్‌గా ఎంపిక చేసుకోవాలని సూచించారు. సమావేశంలో అధ్యాపకులు సత్యనారాయణ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్ల బదిలీలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఉమ్మడి జిల్లాలో డిప్యూటీ తహసీల్దార్లు కొందరు బదిలీ అయ్యారు. వనపర్తి జిల్లాలో పనిచేస్తున్న స్వప్న, జోగుళాంబ గద్వాల జిల్లాలో పనిచేస్తున్న ఆంజనేయులును మహబూబ్‌నగర్ జిల్లాకు కేటాయించారు. ఈ మేరకు సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాకు బదిలీ అయిన వారికి స్థానాలను కేటాయించనున్నారు.

రైలు ఢీకొని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి దుర్మరణం

మహబూబ్‌నగర్ క్రైం/దేవరకద్ర: వేర్వేరు ప్రాంతాల్లో పట్టాలు దాటుతున్న ఇద్దరు వ్యక్తులను రైళ్లు ఢీకొట్టడంతో దుర్మరణం చెందారు. రైల్వే ఎస్‌ఐ కె.రాజు వివరాల మేరకు.. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో శనివారం గుర్తుతెలియని వ్యక్తి (60) రైలు పట్టాలు దాటుతున్న క్రమంలో రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి వద్ద ఎలాంటి వివరాలు లభించలేదని.. మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దేవరకద్రలో మూతపడిన రైల్వేగేటు సమీపంలో పట్టాలు దాటుతున్న ఓ వ్యక్తిని రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. రైల్వే ఎస్‌ఐ అక్బర్ వివరాల మేరకు.. దేవరకద్ర మండలం పెద్దరాజమూర్‌కు చెందిన బాజాపల్లి ఆంజనేయులు (52) హైదరాబాద్‌లో కూలీ పనులు చేసుకునే వాడు. ఇటీవల తిరిగి స్వగ్రామానికి వచ్చిన అతడు.. దేవరకద్రలోని అత్తగారింటికి వెళ్లడానికి రైల్వే గేటు వద్ద పట్టాలు దాటుతుండగా.. రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్‌ఐ తెలిపారు.

ఫిల్టర్ ఇసుక కేంద్రాలు ధ్వంసం

బిజినేపల్లి: మండలంలోని లట్టుపల్లి గ్రామ శివారు తండాల్లో అక్రమంగా ఏర్పాటు చేసిన 4 ఫిల్టర్ ఇసుక కేంద్రాలను తహసీల్దార్ శ్రీరాములు, ఎస్‌ఐ శ్రీనివాసులు ధ్వంసం చేశారు. శనివారం ప్రత్యేకంగా ఫిల్టర్ ఇసుక కేంద్రాలపై రైడ్ నిర్వహించారు. మిట్యా తండాతో పాటు ఇతర తండా పరిసరాల్లో అక్రమంగా డంప్ చేసిన ఫిల్టర్ ఇసుకను ధ్వంసం చేసి 8 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఇళ్లు, భవనాల నిర్మాణం కోసం ఫిల్టర్ ఇసుకను వాడరాదని, నాణ్యమైన ఇసుకను వినియోగించాలన్నారు. ఇసుక అవసరం ఉన్న వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫిల్టర్ ఇసుకలు నిర్వహించే వారి సమాచారం ఇవ్వాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన పేర్కొన్నారు. ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని వారు హెచ్చరించారు.

బీచుపల్లి క్షేత్రం.. భక్తజన సంద్రం


ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి

- వైభవంగా కొనసాగుతున్న ఉత్సవాలు
- మార్మోగిన అంజన్న నామస్మరణ

ఎర్రవల్లి: బీచుపల్లి క్షేత్రం శనివారం ఆంజనేయస్వామి నామస్మరణతో మార్మోగింది. నెల రోజులపాటు జరిగే స్వామివారి ఉత్సవాల్లో మొదటి శనివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వందలాదిగా తరలివచ్చారు. ముందుగా కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి.. స్వామివారి దర్శనానికి క్యూ కట్టారు. కొందరు భక్తులు స్వామివారికి దాసంగాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పరిసరాల్లో వెలసిన వివిధ దుకాణాలు కొనుగోలు దారులతో రద్దీగా కనిపించాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు ఆంజనేయస్వామికి పంచామృత అభిషేకం, ఆకుపూజ, మహా మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు.


ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు


కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తూ..